క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసు తదితరులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. విజయనగరం జెడ్పీ చైర్మన్ బొత్సా వాసుతో కలిసి వెళ్లిన ఆయన సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు.

దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేత



దివ్యాంగుడికి చక్రాల కుర్చీ అందజేసిన దాతలు

కామవరపుకోట: ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్న కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీం సభ్యుల సేవలు అభినందనీయమని అంకాలంపాడు సర్పంచ్ చొక్కా స్వర్ణ అన్నారు. ఇటీవల అంకాలంపాడు పంచాయతీ పరిధిలోని జలపవారిగూడెంకు చెందిన రాచప్రోలు రాములు సుగర్ వ్యాధితో బాధపడుతుండగా ఆపరేషన్ చేసి కాలు తొలగించారు. స్థానిక సోషల్ వర్కర్ వీరమల్ల మధు ఆధ్వర్యంలో శుక్రవారం దాత దేవులపల్లి నాగు సహాయంతో రెండు చక్రాల కుర్చీ రాములుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ నిజాపరపు దుర్గాప్రసాద్, చొక్కా వెంకటేష్, నక్కా దయాసాగర్, పల్లా కల్యాణ్, రాచప్రోలు రాజు, చొక్కా ఆనంద పల్లా హర్ష పాల్గొన్నారు.

ధర్మారావుపేటలో శాంతి ర్యాలీ



ధర్మారావుపేటలో శిలువ మార్గం నిర్వహిస్తున్న విశ్వాసులు

కొయ్యలగూడెం: ధర్మరావుపేటలో పరిశుద్ధ శిలువమార్గం శుక్రవారం నిర్వహించారు. 41 రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి విశ్వాసులు క్రీస్తు మార్గాలను ప్రచారం చేయడంలో అకుంఠిత దీక్షను కనబరిచారని పాస్టర్స్ ఫ్రాన్సిస్, శౌరి పేర్కొన్నారు. శిలువ మార్గం మానవాళికి జీవన మార్గాన్ని నిర్దేశిస్తుందని పేర్కొన్నారు. ఆర్‌సీఎం సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి కిలో మీటర్ మేర విశ్వాసులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. సమీర్, సురేష్ ,తంబీ జోషఫ్, యోషేపు, సింగమాత్యు, ఏసురత్నం, రవి, రాంబాబు, జొన్నకూటి జయరాజు, బ్రహ్మానందం యూత్ సభ్యులు దున్న ఇశ్రాయేలు, ఎం .సురేష్, ఎం.కళ్యాణ్, కండెల్లి శివ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



కొయ్యలగూడెంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కేఆర్ పురం డివిజన్ పరిధిలో కొయ్యలగూడెం మండలం మండల ప్రజా పరిషత్ హాలులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సమావేశ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి డీపీఎం తాతారావు అవగాహన పర్యవేక్షకులుగా హాజరయ్యారు. వెలుగు ఐటీడీఏ అధికారి నాగేశ్వరరావు హాజరై ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల పాత్రపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశమునకు డీపీఎంయు సిబ్బంది నాగరాజు, పద్మనాభం, సుబ్బరాజు, కోఆర్డినేటర్ వై మునసలయ్య హాజరయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించండి

కొయ్యలగూడెం: అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలని హౌసింగ్ కాంప్లెక్స్ ప్రాంతవాసులు శుక్రవారం కోరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలనలోనే అంగన్‌వాడీ కేంద్రం భవనానికి స్థలం కేటాయించారని, తదనంతరం ప్రభుత్వాలు భవన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో మంజూరైన స్థలం కబ్జాకి గురైందని అన్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి సమస్య తీసుకువెళ్లగా అప్పటికప్పుడు మరో స్థలాన్ని అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కేటాయించారన్నారు. అది కూడా కొందరి ప్రమేయంతో కబ్జాకి గురైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రం మంజూరుకు కృషి చేసే విధంగా ప్రజాప్రతినిధులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా నిర్వహించారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఆదేశాల మేరకు మండలంలో అన్ని ఎంపీటీసీలను పార్టీలకు అతీతంగా కలుసుకుని, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఎంపీటీసీలను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల కవురు శ్రీనివాస్‌కు 1వ ప్రాధాన్యత ఓటు, వంకా రవీంద్రనాథ్‌కు 2వ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మండలంలో అందరు ఎంపీటీసీలు తమకు ఓటు వేసేందుకు సుముఖతతో ఉన్నారని బాబ్జి తెలిపారు. ఎంపీపీ కొదమ జ్యోతి, వైస్ ఎంపీపీలు నరెడ్ల బజ్జిబాబు, రాపోలు మధులతో కలిసి బాబ్జి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పార్టీ నాయకులు రాజు, రవి, మోహన్‌రెడ్డి, ఇర్ల శ్రీనివాసరెడ్డి, కనికెళ్ల ప్రసాద్, కొదమ పద్మరాజు, కొయ్య లీలాధర్‌రెడ్డి, చంటి, ప్రగఢ ప్రకాష్, తానిగడప రామకృష్ణ, బుద్దాల రాజు, మల్లాబత్తుల కృష్ణచైతన్య, ఎంపీటీసీలు బల్లె మోహన్‌రెడ్డి, కుక్కల సత్యనారాయణ, తాతారావు, పోతన శ్రీను పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో ఎంపీటీసీలను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పార్టీ నాయకులు



ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై ఎంపీటీసీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్

ఎమ్మెల్సీ ఎన్నికలపై మాక్ పోలింగ్

చింతలపూడి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లను గెలిపించాలని ఎంపీపీ రాంబాబు నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై నమూనా బ్యాలెట్ ద్వారా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మొదటి ప్రాధాన్యతా ఓటు కవురు శ్రీనివాస్‌కు, రెండో ప్రాధాన్యతా ఓటు వంకా రవీంద్రనాథ్‌కు వేసి గెలిపించాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లో రెండు ఎమ్మెల్సీలను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజ సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జంగారెడ్డిగూడెం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసపురం, వేగవరం, గురవాయిగూడెం, దేవులపల్లి, లక్కవరం, నిమ్మలగూడెం, పేరంపేట గ్రామంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పర్యటించి వైఎస్సార్‌సీపీ బలపర్చి అభ్యర్థులను ఓట్లను వేయాలంటూ ఎంపీటీసీలను అభ్యర్థించారు. ఎంపీపీ కొదమ జ్యోతి, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నులి నివారణకు సమష్టి కృషి

బుట్టాయగూడెం: ఈ నెల 14న నిర్వహించే నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శులు కూడా పాల్గొని విజయవంతం చెయ్యాలని ఎంపీడీఓ పి. శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో 1 నుంచి 19లోపు వయస్సు కలిగిన వారందరికీ తప్పనిసరిగా నులిపురుగుల మందు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణకు చర్యలు

టి.నరసాపురం: ఈ నెల 14న నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎన్‌టీస్వామి సూచించారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సన్నద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్, ఎంఈవో టి.రామూర్తి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో రుద్రాభిషేకం



నూకాలమ్మ జాతర మహోత్సవ కరపత్రం ఆవిష్కరణ



జంగారెడ్డిగూడెంలో ముత్యాలమ్మకు పూజలు





రెడ్డిగణపవరంలో హోమం చేస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూతన మున్సిపల్ కార్యాలయం వద్ద ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అనంతేశ్వర స్వామి, అమ్మవార్లకు, ఏకవార పంచామృత రుద్రాభిషేకం, పుష్పాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో బవిరిశెట్టి సతీష్ ,లక్ష్మీ దుర్గ ఉభయదారులుగా ఆలయ అర్చకులు కాజా ఫణి కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగా జ్యోతి దంపతులు, తిలక్ ఇందిరా దంపతులు, సురేష్ తులసి దంపతులు పాల్గొన్నారు.

కరుణించు కనకదుర్గమ్మ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. నాల్గోరోజు శుక్రవారం అమ్మవారిని పలు రకాల పూలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవం నిర్వహించారు. తిరుణాళ్లకు వచ్చే భక్తుల కోసం సినీ మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటు చేశారు.

17 నుంచి నూకాలమ్మ వార్షిక జాతర

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తికి,మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సమావేశంలో 59వ ఉగాది వార్షిక జాతర మహోత్సవ ఆహ్వాన పత్రాలు అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఉగాది వార్షిక జాతర మహోత్సవాలు మార్చి 17 శుక్రవారం నుంచి 25, శనివారం వరకూ నిర్వహిస్తామని తెలిపారు. ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజికసేవా కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉగాది జాతర మహోత్సవాలు

ఈ నెల 17వ తేదీ ఉదయం 3:25 గంటలకు కలశ స్థాపన, 6 గంటలకు గరగలు తీయడం, 9 గంటలకు గంగానమ్మ ఆలయం నుంచి 1,008 ముత్తైదువులతో సుమంగళీ ద్రవ్యాలతో శోభాయాత్రగా గంగానమ్మవారు తరలివచ్చి నూకాలమ్మవారికి సారె సమర్పణతో కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయని కమిటీ తెలిపింది. 25వ తేదీ ఉదయం నిర్వహించనున్న మహాపూర్ణాహుతితో కార్యక్రమాలు సంపూర్ణమవుతాయన్నారు.ఏటా ఉగాదికి నిర్వహించే వార్షిక జాతరలో పెద్దఎత్తున భక్తులు పాల్గొంటారని ఆలయ కమిటీ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తోందని అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. అనంతరం భక్తులకు ఆహ్వానపత్రాలు పంపిణీ చేసి, ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కేఎల్ఎన్ ధనకుమార్, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాపనమ్మ గుడి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు

పోలవరం రూరల్: పోలవరం బస్టాండ్ నుంచి నిర్వాసిత గ్రామమైన రామయ్యపేట బాపనమ్మ గుడి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎం బి.గంగాధరరావు తెలిపారు. శుక్రవారం నుంచి బస్సులను బాపనమ్మ గుడి వరకు నడపడం ప్రారంభించామని, ఒక్కొక్క సర్వీసు పెంచుకుంటూ వెళతామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ బస్సు సర్వీసులను పెంచినట్టు ఆయన పేర్కొన్నారు.

దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక పక్క మెట్లు, మరొక పక్క ప్రయాణికులు కూర్చునేందుకు కుర్చీలు ఉండగా, అదే ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక బస్టాండ్‌లో తాజాగా కొత్త దుకాణాలు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం దుకాణం ఏర్పాటు చేసే ప్రాంతంలో గతంలో విచారణ కౌంటర్ ఉండేది. ప్రయాణికులకు మెట్ల మార్గం వద్ద విచారణ కౌంటర్ ఉండటంతో బస్సులు వచ్చే సమయంలో ప్రయాణికులు హడావుడి వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురయ్యేవారు. దీంతో అప్పట్లో అధికారులు కౌంటర్‌ను అక్కడి నుంచి తొలగించి వెనుక భాగంలో పెట్టారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చంటిబిడ్డల తల్లులు పిల్లలకు పాలు ఇచ్చేందుకు ఫీడింగ్ ఛాంబర్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా ఫీడింగ్ ఛాంబర్‌ను అక్కడి నుంచి తొలగించి దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు, స్థానిక అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. దీనిపై డిపో మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ దుకాణం ఏర్పాటును ఉన్నతాధికారులతో మాట్లాడి పరిశీలిస్తామన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

జంగారెడ్డిగూడెం: చత్రపతి శివాజీ త్రి శతజయంతి కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం (పర్సనాలిటీ డెవలప్‌మెంట్)పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ కె.పంకజ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తుల శీల నిర్మాణానికి దారి తీసేదే సరైన విద్య అని స్వామి వివేకానందుడి మాటలను ఉటంకించారు. నేటి సమాజంలో నైతిక విలువలు కొరవడి రకరకాల అకృత్యాలు, ఘోరాలు జరుగుతున్నామని, దానికి కారణం వ్యక్తుల్లో వ్యక్తిత్వ వికాసం లోపించడమే అన్నారు. నేటి గ్లోబలైజేషన్ యుగంలో ప్రపంచం ఒక గ్రామంగా మారిందని, వ్యక్తిలో నైతిక విలువలు పతనమవుతున్నాయని అన్నారు. ప్రతి వ్యక్తి వికాసాన్ని పెంపొందించుకుని, అర్థవంతమైన జీవితాన్ని గడపాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అన్నారు. అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, డాక్టర్ బదరి నారాయణ, వెంకటాచార్యులు, వెంకటలాల్, హనుమంతరావు, శ్రీనివాస్‌రావు, డాక్టర్ ఉత్తమ్ సాగర్, రమాదేవి, విజయ దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు

అగ్నిప్రమాద బాధితులకు సహాయం అందజేత

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు అండగా నిలిచారు. తన భార్య తాటి రత్నకుమారి, తాటి మాలక్ష్మి జ్ఞాపకార్థం తన స్వగ్రామమైన కన్నాయిగుట్టలో 27 గిరిజన కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం సర్పంచ్ సోడె విజయ, చీమల వెంకటేశ్వర్లు, కారం దారయ్య, కారం బొజ్జి, ఎండీ మున్వర్ పాల్గొన్నారు.

సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో

ఏలూరు సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో కన్నాయిగుట్ట అగ్నిబాధితులకు వంట పాత్రలు, ట్రంకు పెట్టెలు, బియ్యం డ్రమ్ములు, దుస్తులు, దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 3 వేల విలువ చేసే వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె శేఖరరావు, జిల్లా సేవా దళ్ కన్వీనర్ వెంకటేశ్వరావు, ధర్మారావు, నర్రా రాంబాబు, పి మూర్తి, వెంకట సుబ్బారావు, జి బాబు, బుట్టాయిగూడెం సమితి కన్వీనర్, ప్రముఖ న్యాయవాది ఏసుబాబు పాల్గొన్నారు.



కన్నాయిగుట్టలో అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొట్టిన కారు

కామవరపుకోట: మండలంలోని రావికంపాడులో ప్రైవేటు స్కూల్ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం కామయ్యపాలానికి చెందిన ఎ.వెంకటదుర్గారావు బంధువులను కారులో విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా కామవరపుకోట మండలం రావికంపాడు మసీదు సమీపంలో వచ్చేసరికి ఏలూరు వైపు వెళుతున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూలు బస్సు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతినగా కారు ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. తడికలపూడి ఎస్సై కె.వెంకన్న ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు.

వాహనాల తనిఖీ



ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు.

ద్వారకాతిరుమల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై పోలీసులు శుక్రవారం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బంది కలసి పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డబ్బు, మద్యం వంటివి తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు చేపడతామన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

కొయ్యలగూడెం: సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు వెలగలదుర్గారావు ఆధ్వర్యంలో బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో మొదటి ఉపాధ్యాయురాలుగా, రచయిత్రిగా మహిళలు చైతన్య పరచడంలో ఆమె చేసిన కృషి మరువలేనిది బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు తెలియజేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మహిళలు పార్టీలకతీతంగా ఏకమవ్వాలని అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాడి చర్ల సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, సూరవరపు గోపాల్ రాజు, బూసి త్రిమూర్తులు, శెట్టి శ్రీనివాసరావు, ముప్ప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రేపు 'మా ఊరి తంగేడు పూలు' పుస్తకావిష్కరణ

కామవరపుకోట: మా ఊరి తంగేడు పూలు పుస్తకావిష్కరణను విజయవంతం చేయాలని కామవరపుకోట ఉపసర్పంచ్ మేడూరు రంగబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీవీయే చినరాజప్ప కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మా ఊరి తంగేడు పూలు పుస్తకంలో కామవరపుకోట చరిత్రతోపాటు విశేషమైన వ్యక్తుల జీవిత విశేషాలను 40 ఏళ్ల క్రితం కామవరపుకోటలో నివాసం ఉన్న కొంకెపూడి అనురాధ కథనాలు రాశారని అన్నారు. ఈ పుస్తకావిష్కరణకు పుర ప్రముఖులు, గ్రామ ప్రజలు అందరూ హాజరుకావాలని రంగబాబు కోరారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి కొంకెపూడి అనురాధ, ఎంబీజేఆర్ ప్రసాదరావు, పోరంకి నాగరాజు, కాకి చంటి, వీరమల్ల మధు, బచ్చు వెంకటేశ్వరావు, నిజపరపు దుర్గాప్రసాద్, మున్నంగి శ్రీనివాస్, రామ్ కుమార్, సాజన్ సాయి, పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మేడూరి రంగబాబు

ఆశీల వసూలుకు వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో కబేళాకు సంబంధించి ఈ నెల 14న ఆశీల వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.భవానీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి 31 మార్చి, 2024వ తేదీ వరకు సంవత్సర కాలానికి ఆశీలు వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు 14వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

పోరాడే తత్వం పెంపొందించుకోవాలి

కొయ్యలగూడెం: విద్యార్థి దశలోనే బాలికలు స్త్రీల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళా సాధికారిక వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పరింపూడి బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వాలు మహిళలకు కల్పిస్తున్న ప్రత్యేక హక్కులు, చట్టాలు తెలుసుకోకపోవడం వల్ల న్యాయం పొందలేకపోతున్నారని అదే సమయంలో అన్యాయానికి గురవుతున్నారన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్న నేపథ్యంలో హత్యాచారాల చట్టాలను కఠినంగా అమలు చేయాలంటే పోరాడే తత్వం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సహచర మహిళ న్యాయవాదులు ప్రసంగించారు. పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీలత న్యాయవాదులు మేకల రామమోహన్రావు, పి.పెద్దిరాజు, బండారు లతా కుమారి, బల్లి సాయికుమారి, కాకి జెన్నీ, తొర్లపాటి శ్రీనివాస్, టి రాము, తోట పద్మిని పాల్గొన్నారు.



కొయ్యలగూడెం బాలిక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న న్యాయవాది అచ్యుత్ శ్రీనివాస్

పీఏసీఎస్ సమావేశం

జంగారెడ్డిగూడెం: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సన్నద్ధంగా ఉన్నామని జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు అన్నారు. జంగారెడ్డిగూడెం పీఏసీఎస్‌లో శుక్రవారం రైతులకు ఇచ్చే రుణాల రికార్డులను డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, సెక్రటరీ రత్నాజీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీఏసీఎస్ ద్వారా నూతన వ్యాపారాలు ప్రారంభించి సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఏకాగ్రతతో పనిచేస్తే ప్రమాదాల నివారణ

జంగారెడ్డిగూడెం రూరల్: కార్మికులు పనిచేసేటప్పుడు వేరే విషయాలను ఆలోచించకుండా చేసే పనిపై ఏకాగ్రత ఉంచితే ప్రమాదాలను నివారించవచ్చని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాడువాయి ఆంధ్రా సుగర్స్ కర్మాగారంలో శుక్రవారం 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు మేనేజర్ రాయుడు సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం కార్మికులు పనిచేయడం నేర్చుకోవాలన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని భద్రతా ఆవశ్యకతపై వ్యాసరచన, గేయాలాపన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ. శ్రీనివాస్, మేనేజర్ రాయుడు సుబ్బారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం భద్రతా శపథం చేశారు.



తాడువాయిలో భద్రతా వారోత్సవాల్లో భద్రతా శపథం చేస్తున్న దృశ్యం

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

పోలవరం రూరల్: మండలంలోని రైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తామని అవసరమైన వారు ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలోని 8 ఆర్‌బీకేల పరిధిలో ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్లు, రోటోవేటర్లు, స్ప్రేయర్లు తదితర వ్యవసాయ పరికరాలు 40శాతం సబ్సిడీపై అందజేస్తామన్నారు.